# ఆయనభర్తా, ఈమె భార్యా—

## చిన్న కథ

"మొగంనిండా గంధంపూసి పెద్దబొట్టు పెట్టుకుంటాడు. నడినెత్తిన వున్న నాలుగుపిలకలూ అనేక రకంగా ముడివేస్తాడు. నెల కొకసారి ఎప్పుడో మంచి రోజు మాచుకుని క్షవరం చేయించుకుంటాడు. ఇక ఆయన భార్యను చూస్తే రోజు కొకవేషంగా తయారౌతుంది. వెండ్రుకలు ముడవడములో ఎన్నిరకాలు వున్నాయో అన్నీ ఆమెకు తెలుసు. కట్టూ, మాట ఒడుపూ, నడకతీరూ, కన్నుల చలాకితనమూ పురుషప్రపంచాన్నంతా ఆకర్షించుకునే లాగుంటవి."

రచయిత

## పురాణం కుమారరాఘవశాస్త్రి, బి. యే.

సుబ్బయ్య పట్టి అమాయకుడనాల్లో, చచ్చుపెద్దమ్మ అనాల్లో, కేవలం ఛాందసుడనాల్లో, తెలియడంలేదు. ఎంత తెలివితక్కువనాగన్న అయితేమాత్రం తన భార్య తనను చంపుతానని బెదరిస్తోందంటూ ఊళ్ళోకనబడ్డ వాడితోనల్లా చెప్పుకునే వాడెవడైనా ఉన్నాడూ? భార్యేమిటి? భర్తను చంపడమేమిటి? ఎక్కడైనా అంత అన్యాయం ఉంటుందీ? రంకుతనానికి అలవాటు పడ్డ ఇల్లాలైనా మొగుణ్ణి కాస్త అడ్డంపెట్టుకుని తన వ్యవహారం సాగించుకుంటుంది గాని, ఒక్కసారిగా తనపసుపుకుంకుమలు బండిరేవులో కలుపుకోడానికి చూడదే? అయినా, భర్తను చంపాలిసిన అవసరమేముంటుంది ఆడుదానికి? లోకులు సుబ్బయ్యమాటలకు నవ్వుకున్నారేగాని, "పాపం, ఈ బ్రాహ్మణుడు నిష్కారణంగా చంపబడతాడే, కొంచెం, ఆదుకుందా" మని ఎవరూ అనుకోలేదు. "పోవయ్యా! పిచ్చివాడా! నీ భార్య నిన్ను చంపడమేమిటి?" అనేవాళ్లు కొందరు. "సుబ్బయ్యగారూ అదంతా ప్రణయకోపం లెద్దురూ, మీకు తెలీదు" అన్నారు కామసూత్రాలు తెలిసిన పెద్దమనుష్యులు. "గడుసుపెళ్లాం గలవాడి అవస్థ ఇట్లాగే ఉంటుంది" అని గొణుక్కొనేవాళ్లు మరో రకం మనుష్యులు.

అసలు సుబ్బయ్యకూ, అతని భార్యకూ ఒకానొక వాగ్వివాదం చాలారోజులనుంచీ జరుగుతూనే ఉంది. ఆయన సంపాదించినది నాలుగైదెకరాల ఆస్తిఏమో ఉన్నట్లుంది. అది కాస్తా తనపేర పెట్టమంటుందావిడ. ఆయనేమో అందుకిష్టంలేక, ఏవో సమాధానాలు చెబుతూ కాలంగడుపుకొస్తున్నాడు. అది వాళ్ళింట్లో రోజూ కొంతసేపు వాగ్యుద్ధానికి కారణమైంది.

ఆస్తి తనపేర పెట్టమని అతని ప్రాణాలు కొరికేయవలసినంత అవసరమేమి వచ్చిందాయిల్లాలికి? ఆయనేమైనా దుబారాఖర్చులు చేసి జూదంలోనూ, వ్యభిచారానికీ తగలేస్తున్నాడా అంటే "ఎబ్బే, అటువంటి వ్యవహారాలేమీ సుబ్బయ్యకు లేవ"ని ఊళ్ళోవాళ్ళంతా చెబుతారు. కాఫీకూడా పుచ్చుకోడు. అనవసరంగా తెల్లనాణేన్ని మార్చేస్వభావం కానేకాదు. ఇంకా ఆమే పీడిస్తుందతన్ని పౌడరుడబ్బాలూ, సబ్బిళ్ళలూ, పిన్నులూ, సెంట్లూ—ఏమేమిటో ఉంటవిగా ఈకాలపు ఆడవాళ్ళ సామానులు—అవన్నీ తీసుకురమ్మని. ఆ పోరుపడలేక, డబ్బు ఖర్చుఅవుతున్నదే అనే విచారంతో, అయినా తప్పదుగనుక, అవన్నీ కొనితెచ్చి ఇచ్చేవాడు.

లేకపోతే ఆ ఆస్తిని తనపేర వ్రాయించుకుని తన యాజమాన్యం క్రింద దాన్ని అభివృద్ధిలోకి తెద్దామని ఉద్దేశమా? ఏమో, అదీ నమ్మకంలేదు. మళ్ళీ కొన్నాళ్ళయ్యేసరికి ఆభూమికాస్తా విక్రయమైపోగలదని ఆమె స్వభావమెరిగిన వాళ్ళందరకూ నమ్మకమే. ఔను మరి. విషయలోలత ధననాశనానికి మూలం.

ఉన్న నాలుగెకరాలూ తనపేర పెట్టించేసుకోవాలనే పట్టుదల నానాటికీ ప్రబలమాతూంది. ఇంట్లో

అందుమూలాన్న భార్యాభర్తల మధ్య కీచులాటలు రేగినవి. ఆ సంసారానికిక సుఖమెక్కడుంటుంది? భార్యాభర్తలకు ప్రేమ అనేది సహజంగా ఉండాలి. లేదా, పరస్పరము నెరవేర్చుకోవలసిన విధ్యుక్తధర్మానికి ఇద్దరూ కట్టుబడన్నా ఉండాలి. ఈ రెండూ లేని పక్షంలో వాళ్ళకు విడాకులచట్టం మహోపకారం చేస్తుంది.

సుబ్బయ్య గొప్ప ఆస్తికేమీ వారసుడు కాడు. ముష్టెత్తుకుని జీవిస్తూ, సరిగా తినీతినకా, ఎట్లాగో నాలుగెకరాల భూమి కొనుక్కున్నాడు. దుర్వ్యసనాలు కలవాడు కాడు. చాలవరకు పూర్వకాలపు మనిషి. పింజబోసి మోకాళ్ళకు పైగా బట్టకట్టుకుంటాడు. మొగం నిండా గందంపూసి పెద్దబొట్టు పెట్టుకుంటాడు. నడినెత్తిన ఉన్న నాలుగు పిలకలూ అదొకరకంగా ముడివేస్తాడు. నెలకొకసారి ఎప్పుడో మంచిరోజు చూచుకుని క్షవరంచేయించుకుంటాడు. ఇక ఆయన భార్యనుచూస్తే రోజుకొక వేషంగా తయారౌతుంది. వెండ్రుకలు ముడవడములో ఎన్నిరకాలున్నాయో అన్నీ ఆమెకు తెలుసు. కట్టూ, మాటబడుపూ, నడకతీరూ, కన్నుల చలాకితనమూ పురుషప్రపంచాన్నంతా ఆకర్షించుకునే లాగుంటవి. అధునికమైన అలంకార పద్ధతులన్నీ ఆమె ఎరుగును. ఆమె చూడని సినీమా ఉండదు. సినీమాతారల ఛాయాచిత్రాలు సేకరించడమామె కొక వినోదం.

ఆయన భర్తా; ఈమె భార్యా. ఆయన తూర్పు; ఈమె పడమరా. వీళ్ళిద్దరికీ ఎట్లా కలయిక.

తనకు మల్లే వేషభాషలలో నూతనప్రియత్వం కలిగివుండి, లోకాన్ని మోసగించి తెచ్చిన డబ్బుతో తాగి తందనాలాడే వాడెవడైనా భర్త అయి వున్నట్లయితే, ఆమె పతివ్రత అని పేరు పొందేదేమో, ఒకవేళ. సుబ్బయ్యలాటి వాడుమాత్ర మామెకు తగడు.

ఒకనాటి ఉదయం—సుమారెనిమిది గంటలౌతుంది అప్పటికి- సుబ్బయ్యస్నానం, సంధ్యా మొదలైన ప్రాతఃకృత్యాలన్నీ తీర్చుకుని, ముఖాన, బొర్రమీదా దట్టముగా విభూతిపులిమి, ఎర్రగా తానే తోముకున్న రాగిచెంబు చేతబట్టుకొని యాయవారానికి బయలుదేరేడు. ఆయన వాకిలివద్దకు వచ్చేసరికి, అమ్మగారు గదిలోనుంచి అప్పుడే నిద్రలేచి ఆవులించుతూ, ఒళ్లువిరుస్తూ బయటకు వచ్చింది.

“ఏమే! ఎనిమిది గంటలైంది, చూచావా ఎంత పైకెక్కేడో సూర్యుడు” అన్నాడు సుబ్బయ్య.

“ఏం ఇప్పుడు? ఏం ముంచుకుపోయింది?” అన్న దావిడ నిర్లక్ష్యంగా కనుబొమలు ముడిచి.

“నేను వెళ్ళుతున్నాను. దబ్బున కాఫీచేసుకు తాగి వంట చెయ్యి.”

“చెయ్యొద్దూమరి, దొరగారు వచ్చేవేళకు! నాకూ, పిల్లకూ హోటలునుంచి తెప్పించుకుంటాను. నీ వెక్కడున్నా ధర్మపిండము చూచుకో ఇవ్వాల్టికి.”

“అమ్మాయి పైపను లవీ చేస్తుంది. నీవు పొయ్యిదగ్గర కూర్చుని కాస్త ఉడకేయలేవూ? ఏం, సుస్తీగా ఉన్నదా?”

“అబ్బ! ఏమి కనుక్కుంటున్నావు నా క్షేమం? ఎంత అపేక్ష తగలడి పోతున్నది! నాఖర్మం కాలి నీ పెళ్ళాన్నయినాను”

“సరే, ఈ సొదకేమిలే. మామూలేగా! నేను పోతున్నాను. ఇంతకూ వంటచేస్తావా, చేయవా?”

“ఒకవేళ చేసినా, నిన్నకొన్న కాకరకాయలు రెండో మూడో ఉన్నవి. అవి మసాలాపెట్టి వేయిస్తాను; నీదాకా రావవి. చేస్తే ఉల్లిగడ్డల పులుసు చేస్తాను. అది నీవసలే దగ్గరకు రానీయవుగా!”

“ఏమన్నా ఏడ్చుకో, నేను పోతున్నాను.”

“పోతున్నాను! పోతున్నాను! పోదువుగానిలే. మధ్యాహ్నం ఆ ప్రైవేటుప్లీడరుగార్ని పిలుస్తాను; రాతకోతలన్నీ అయిపోవాలి.”

“నీకేమీ బుద్ధిఉన్నట్లు కనుపించడంలేదేమే? ఉన్న దానాలుగెకరాలకంటే లేదాయెను. అందులో రెండు మూడెకరాలన్నా ఆశపెడితేనేగాని మనపిల్లకు పెండ్లయ్యేట్టు కనిపించడం లేదు, కాలాన్నిబట్టి చూస్తే. అందులో మన అమ్మాయికి కాస్త కాలు అవు

డు. ఉన్నపొలంకాస్తా నీపేర వ్రాసేయమంటావు. పిల్లసంగతేమి కావాలి? ఆలోచించుకోవద్దూ? జ్ఞానం లేద్దూ?''

"అవును. జ్ఞానంలేనిదాన్ని కాబట్టే ఇలా నీదగ్గర పడిఉన్నాను. ఈకాలంలో ఏ ఆడదైనా దమ్మిడీ కూడా చేతిలో లేకుండా ఉన్నదీ? నేనొక్కదాన్నితప్ప. కానీడబ్బు దగ్గరనుంచీ నిన్నడిగితేనేగాని గతి లేకుండా వచ్చించిది. మొన్న నెవళ్లో ముగ్గురు నలుగురు ఆడవాళ్లు వాళ్ళక్లబ్బుకుట చందా అడిగేందుకొచ్చారు మనింటికి. వాళ్ళను చూస్తే ఎంత ముచ్చటేసింది! ఆకాలిజోళ్ళూ, ఆ పొట్టిరవికలూ, ఆ చీరకట్టుకోటాలూ, ఆ తలలు ముడుచుకోవడమూ, ముఖ్యంగా ఆ చేతుల్లో 'మనీపర్సు'లు పట్టుకోవడమూ—అన్నీచూస్తే వాళ్ళముందు నేనొకపాకీదానివలే అయిపోయాను. వాళ్లు చందా అడిగితే నాదగ్గిరేమైనా ఉన్నది గనుకనా ఒక రాగిదమ్మిడీ అయినా, తడుముకోకుండా ఇచ్చి గౌరవం నిలబెట్టుకోవడానికి. బుద్ధితక్కువై 'మా ఆయన్ను అడిగి తీసుకొని రేపు ఇస్తాలెండి' అన్నాను. అనేసరికి వాళ్ళంతా ముసిముసినవ్వులు నవ్వుకున్నారు. 'ఇంతేనా నీపస, డబ్బుకు ఇంటాయన్ను అడగాలిసినదానివేనా? అని నన్ను పరిహాసం చేస్తున్నట్లుగా. ఇలాంటి నిప్పచ్చరపుబతుకు నాకక్కర్లేదు బాబూ! ఏ నీళ్ళల్లోనో, నిప్పుల్లోనో పడి చస్తాను. శుభ్రంగా పులుగడిగిన ముత్యంలాగా ఉందువుగాని.''

ఈమాటలు వింటున్నకొద్దీ సుబ్బయ్యకు దేహం మొద్దుబారి పోతున్నది. అయితే ఈ గయ్యాళిముండ బలవంతింగా ప్రాణం తీసుకుంటుందేమో ఒకవేళ? అట్లా సాహసించి భావుల్లో, చెరువుల్లో పడి చచ్చిపోయిన స్త్రీలంతా—ఆయ నెరిగినవాళ్లు కళ్ళముందు ఒక్కసారిగా గోచరమైనారు. పోలీసులు రావడం, ఒక పెద్ద కేసవడం, తాను బోనులో నిలవడం, ఏమేమిటో ఒక కల వలే ఉన్నది సుబ్బయ్యకు.

కొంచెంసేపటికి మళ్ళీ సుబ్బయ్యకు మెలకువ కలిగినట్లయింది. "ఈ తెంపి ఆత్మహత్యచేసుకునే రకంకాదు, నాపాలిటికి యమదూతగా పుట్టిన యీపాపి నన్ను చంపకుండా చావదు.'' అనుకున్నాడు. ఆ అమాయికుడు.

చివరకు ధైర్యంచేసి అనగలిగేడు సుబ్బయ్య: "నీ వెంతయినా, పీక్కో, నేను చచ్చినా నీపేర రాయను.''

"అలాగా, అయితే నీవు చస్తేగాని నా కోరిక నెరవేరదన్న మాట.''

"ఏడిచావు, పో, ముండా!''అంటూ విసుగుతో గడప దాటేడు సుబ్బయ్య.

"నీవు బ్రతికి ఉండగానే నేను ముండనెట్లా గాతాను?'' అని గొణుగుతూ ఆమె దొడ్లోకిపోయింది.

* * *

ఆనాడే సాయంత్రం సుమారైదుగంటలప్పుడు సుబ్బయ్య భార్య మేదరి ఈరిగాడిపాకలోనుంచి వస్తోంది. ఎరిగినఆవిడెవరో ఆదారినపోతూ "ఏమమ్మా ఇలావచ్చావు?'' అని అడిగింది. "ఏమీలేదు. మాయింటి దొడ్డివేపు చావడికి తడక ఒకటి అల్లిద్దామని ఈరిగాడితో మాట్లాడి పోవచ్చాను.'' అని బొంకింది.

"దొరక్కదొరక్క, ఈరిగాడే దొరికేట్టమ్మానీకు! వాడు వట్టి తాగుబోతువెధవ. డబ్బుకోసం హత్యలు చేయడానికైనా వెనుదీయని రాక్షసుడు వాడు. అంతకన్నా మంచివాళ్ళూ, బాగాతడికలల్లేవాళ్ళూ లేకపోయినారా!'' అంటూ ఆ ఇంకో ఆవిడ వెళ్ళిపోయింది.

* * *

ఆ మర్నాటినుంచీ సుబ్బయ్య ఎక్కడా కనుపించడంలేదు. ఆయన భార్య, కూతురూమాత్రమే ఇంట్లో ఉంటున్నారు.

పూర్ణ స్వాతంత్ర్యం అనుభవించేవాళ్ళకళ ప్రకాశిస్తున్న దిప్పుడామెముఖంలో. ప్రస్తుతమేదైనా ఒక ! 'ఫిలిం'లో నటించాలని ప్రయత్నాలు చేస్తున్నది.